# రంగాజీ—క్షేత్రయ—విజయరాఘవుడు

రచయిత:

మల్లాది రామకృష్ణశాస్త్రి, ఎం. ఏ.

రసికశిఖామణి, మహారాజు విజయరాఘవరాయలు, సాయంసమయాన 'వసంతవిలాసం'లో విహరించడానికి వెళుతున్నాడు:

చక్కని పారశీక హయాన్ని అధిరోహించి, ఈడు జోడుగఉన్న చెలికాండ్రు వెంటనంటిరాగా, చతురంగబలాన్ని సమకూర్చుకుని జైత్రయాత్రకు బయలుదేరిన మన్మథునివలె, తంజనగర రాజవీథిని, పరివారసమేతుడై సాగిపోతున్నాడు.

సౌధోపరిభాగాలనుంచి పౌరకాంతలు ముత్యాలసేసలు చల్లుతున్నారు. 'శుద్ధాంత ముగ్ధాంగనలు' సోరణగండ్లగుండా ఆమహారాజకుమారుని విలాసాన్ని, వైభవాన్ని కరువుదీరా కని, మనసు మరల్పలేక పరవశలవుతున్నారు. సామంతుల భవనాలన్నీ గడచి చాలాదూరముపోయి, శ్రీదేవి హర్మ్యాన్ని సమీపించేటప్పటికి, నెమ్మదిగా వాజిని పోనిస్తున్నాడు విజయరాఘవుడు. శ్రీదేవి, రఘునాథరాయలకు ప్రాణసమాన అయిన ప్రియురాలు. మహారాజకుమారునియందామెకు పుత్రవాత్సల్యము.

అనుదినమూ మామూలుగా అతడు, ఆ త్రోవను వెళ్ళేవేళకు, శ్రీదేవి చిరునగవుతో, మమకారముట్టిపడేట్టుగా, పల్కరించి, ఆశీర్వదించేది. ఆమాతృమూర్తి దీవన లందుకుని అమితోత్సాహముతో విజయరాయలు తరలి పోయేవాడు.

అక్కడనే ఆగి, తలఎత్తి పైకిచూశాడు. ఎందుచేతనో ఆమె ఆనాడు కానరాలేదు. శ్రీదేవి దర్శనంకోసం నిరీక్షిస్తూ ఎత్తినతల వంచకుండా అలాగే చూస్తూన్నాడు. కొంతసేపటికి, ఒకచక్కని చుక్క, ఒక 'అతిలోకమోహిని' తళుక్కని మెరసి అంతలో మాయమైంది. ఒకనల్లకలువ, ఒక వికచారవిందమూ, ఆతనిపాదసమీపాన వ్రాలినాయి.

మహారాజు మైమరచి పోయినాడు. చాలతడవు చిత్తరువులాగా ఉండిపోయినాడు. తెలివితెచ్చుకుని నేలకుదిగి, ఆసుందరి యిచ్చిన కానుక నందుకొని, ముందుకు సాగి పోయినాడు. మనస్సంతా ఆమెమీదనే ఉంది. విరహవేదనతో నవసిపోతున్నాడు. శైత్యోపచారాలన్నీ వృథా అయిపోతున్నవి.

ఆనవలావణ్యవతి శ్రీదేవికి చెల్లెలి కుంతురు. సర్వకళానిపుణ రంగాజీ.

...ఆమె ఎవరో తెలుసుకున్నాడు. కాని తనకుతానై ఆమెను సమీపించడానికి మనసొప్పలేదు. తనజనకుడి ప్రియురాలు శ్రీదేవి యింటికి తాను మరొకరికోసమైనా విటుడిలాగా వెళ్ళడానికి సిగ్గుపడ్డాడు.

కాని హితులూ, పరిజనులు చేయలేనిపని మన్మథుడు చక్కగా ఒనగూర్చాడు. రంగాజీ కూడా, మహారాజుని చూసినప్పటినుంచి, అతని చెలిమికోసం అలాగే తపిస్తూన్నది. చివరకు ఆమహారాజు ఎంతకూ దయదలచి తన్ను అనుగ్రహించడానికి రాకుండటంచూసి ఒక వెన్నెలరేయిని, దూతిచేత కబురంపింది.

ఆవేళకు విజయరాఘవులు ఉద్యానవనంలో ఆరేయెండలో రంగాజీని తలచుకుని, చాలాతపిస్తూన్నాడు— కేతకీదళముమీద కనుకొలకుల కాటుకతో ...ముత్తెములతీరున

తీర్చిన వ్రాతలో, ఆమె సందేశాన్ని అందుకున్నాడు. తనకు తానై కాకుండా, మరియొకరి పేర, ఆమె పిలిచిన సరసతకు చాలా సంతసించాడు. 'మా వెలది నేలుకోన రావలదె నీవు దయతో విజయరాఘవమహీవర' అని చదివి పరవశుడై ఇక అక్కడ నిలువక ఆదూతిని ఒక అనర్ఘమణిహారముతో సత్కరించి ఆమె వెంటనంటి తనప్రేయసి ఉన్న తావు జేరుకున్నాడు.

ఆవసంతసమయాన వెన్నెలరేయిని తన తోటి కులమువాడని అయినా కనికరించకుండా 'వలరాచరాచవాడు' విజయరాఘవరాయలను రంగాజీ ప్రణయదాసునిగా చేసివేశాడు.

ఆకాలంలో, చక్కదనానికీ; సరసత్వానికీ రతిని, భారతిని మించిన పిల్లలున్న ఆరోజుల్లోనే ఎందునా రంగాజీని పోలినవారు ఎవరూ లేరు. విజయరాఘవుడు ఆమె గొప్పతనాన్ని తన సరసతకూ ఆమె చక్కదనానికీ తగినట్లుగా మన్నించాడు. మహారాణులందరూ ఆమెకనుసన్నల మెలగుతుండేవారు. అంతఃపురానికంతా, రంగాజీయే నాయకురాలు. క్రమంగా మహారాజు ఆమె తోడిదే లోకంగా ఒకక్షణమైనా ఆమెను ఎడబాయకుండా రాచకార్యములన్నీ సమర్థులయిన అమాత్యులమీదవదలి, ఆమె విలాసభవనాన్ని వదలిపోకుండా అక్కడనే కాలము గడపేవాడు.

మహాకవులు ఆమెను తమ మధురకవితాధోరణుల మెప్పించి, ధన్యులై, పిదప మహారాజు మన్ననలందేవారు. మహావిద్వాంసులు శాస్త్రప్రసంగాల్లో రంగాజీచే భళీ అనిపించుకుని, దిగ్విజయసిద్ధి అయినట్లు సంతసించేవారు. రాణులు దేవేరులందరిలోకీ ఆమెను మిన్నగా భావించి గౌరవించేవారు: ఇక మహారాజుకో, ఆమె కేవలమూ ఆరవప్రాణము.

ఏమీ అనలేకపోయినా, సపత్నులందరికీ రంగాజీని చూడ చాలా అసూయగా ఉండేది. ఒకనాడు ఆమె చక్కగా అలంకరించుకుని ఉద్యానవనములోనికి వెళుతూండగా విజయరాఘవునిపట్టపుదేవి ఎదురైనది. రంగాజీ పలుకరించినా, బదులుపలుకక, పెడమోమై నడచిపోయింది. వెనుకనుంచి 'మాయలాడి' అని, ఇంకా ఏమో కొన్నిపలుకులు అస్పష్టముగా రంగాజీకి వినపడినవి. ఆమె చిరునగవుతో ఊరుకున్నది.

ఆవేళ కైనది. మరునాడు మరల తారసిల్లినారు వారిరువురూ. రంగాజీ ఆమెను చూడగానే ప్రక్కనున్న చెలికత్తెతో చెప్పినట్లుగా 'ఏవనితల్ మముందలప నేమిపనో' అన్న పద్యము చదివింది. ఇక అంతటితో ఊరకుండక మహారాణి అరసికతను ఈసడిస్తూ 'రాజనిభాననా సరసురాలవు..:' అనికూడా పఠించింది. ఇంకా గికురింపతలచి 'ఇంతీ...కంతుడనంగుడు నీ తెలివింతేనా విజయరాఘవేంద్రుడే...' అని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. మహారాణి మారుపలుకలేక ఖిన్నఅయి ఊరుకున్నది. మహారాజుకు ఈసంగతి తెలిసి, రంగాజీని మరీ ఆదరించినాడు.

రంగాజీ, విజయరాఘవుని వలచి, వలపించి అన్నివిధాల ఆతని మనసుకు వచ్చునటుల నడచి ధన్యుణ్ణిచేసింది. ఆమహారాజు ఆమెకు పండితసదస్సులో కనకాభిషేకము చేసి, అర్ధరాజ్యము ఒసగి సన్మానించినాడు.

రంగాజీ మన్నారుదాసవిలాసమని తన నాయకుడు విజయరాఘవుని పేరున అద్భుతకల్పనాయుతమునూ, మంజులరచనారంజితమునూ అయిన యక్షగానాన్ని రచించింది. ఆతని పేరునకూ, తనపాండిత్యానికీ [illegible]

తిష్ఠ తెచ్చుకున్నది.

–ఒక సమయంలో వాగ్గేయకారవతంసుడు క్షేత్రియ దక్షిణదేశయాత్ర వెడలి, తీర్థాలు సేవించుకుంటూ తంజావూరు వచ్చాడు. మహారాజు అతన్ని చాలా గౌరవించి తనవద్ద కొంత కాలం ఉండమని బ్రతిమాలి నిలుపుకున్నాడు. అక్కడ ఉండగానే, విజయరాఘవరాయల మీద, ఒకటిరెండు చక్కని పదాలుకూడా చెప్పాడు. కాని రంగాజీమాత్రం అతడు ఎంత విరాగి అయినా భక్తుడయినా శృంగారరచనల్లో తననుమీరిన చేయి అని కొంచెం అసూయతో సరీగా గౌరవించలేదు. క్షేత్రియ అదికనిపెట్టి ఆమెను కొంచెము కవ్వించదలచి,

ఇటువంటివాడు రానేలే, ఈలాగైతే ఏటి వేడుకతనకు। విటరాయుడచ్యుతవిజయరాఘవు డింతో వెరచునమ్మా దానికి ॥

అని మొదలిడి ఓపదము రచించాడు. అంతటితో రంగాజీ మరీ అసూయావేశంతో నిర్లక్ష్యముగా చూడ మొదలుపెట్టింది, ఏమీ చేయలేక. అతడు ఏమీ అనక ఊరుకుని మహారాజానతి మేరకు అక్కడనే ఉన్నాడు. చివరకు, మిగిలిన తీర్థములు సేవించడానికి బయలుదేరబోతూ విజయరాఘవుని సందర్శించాలని ఉదయానే అంతఃపురములోకివచ్చినాడు. మహారాజు అప్పటి కింకా మేల్కొంచలేదు. కాని, రంగాజీమాత్రం, విలాసమందిరమునుంచి చెలికత్తెలు వెంటరాగా నిదురమబ్బుతో, బయలువెడలివస్తూ అతనికి కనపడినది. క్షేత్రియ వెంటనే

'కుసుమశరకేళికామందిరము వెడలెన్...'

అని ఆలాపించాడు. రంగాజీ, సిగ్గుపడి వెళ్ళిపోయింది. తరువాత క్షేత్రియ అక్కడనుంచి సాగిపోయినాడు.

ఒకనాడు ఏకాంతంగా ఉన్నప్పుడు రంగాజీ విజయరాఘవునితో కథఅంతా చెప్పింది. మహారాజు, ఆపల్లవి విని చాలాసంతోషించి మిగతా భాగమంతా సరసంగా పూర్తి చేయగలవారిని ఎక్కువగా బహూకరిస్తానని తన గోష్ఠిలో ప్రచురించాడు. ఎవరిచేతనూ కాలేదు. రంగాజీకికూడా తోచలేదు.

ఆరునెలల తరువాత, విజయరాఘవులు కంచి వరదరాజును సేవించ పోయిఉండగా తీర్థాటనము ముగించి మరలి వస్తూ క్షేత్రియ అక్కడ మహారాజును మరలా దర్శించాడు. అప్పుడు అచ్చట విజయరాయని కోరికమీద ఆపదము—ఆరునెలలక్రిందట పల్లవివేసిన పదమందుకుని,

'వగకాడ మాకంచి వరదా లలనాకేళనుచు.'

అని అనుపల్లవితో రంగాజీ ఆనాటి విలాసవిభ్రమము అంతా సరసంగా మరి మూడు చరణాల్లో కూర్చి వినిపించాడు. రంగాజీ చాలా సంతోషించి అతనికి నమస్కరించి మన్నించమని బ్రతిమాలినది. మహారాజు అతనికి కోరినవన్నీ యిచ్చి సబహుమానముగా పంపివేశాడు.

రంగాజీకి నాటకాభినయమునందు చాలా అభిమానము. విజయరాఘవుని ఎదుట ఆమె అభినయించేది. విజయరాఘవుడు ఆమె సరసను నాయకవేషధారణ మొనర్చేవాడు. అవరోధజనమూ, మరీ ఆప్తులూ మాత్రమే ఆ అవకాశాలచూసి ఆనందించేవారు.

మహారాజు విజయరాఘవుడు ధన్యుడు.

---

[రంగాజీపద్యాలు. చాటుపద్యమణిమంజరిలో ఉన్నాయి. మన్నారుదాసవిలాసం: ఆంధ్రసాహిత్యపరిషత్తువారు దొరికినంతవరకూ ప్రకటించారు.

క్షేత్రియ: విజయరాఘవునిమీద చెప్పిన పదాలు వావిళ్ళవారిప్రతిలో అన్నీలేవు. పాతపుస్తకాల్లో దొరుకుతాయి. చక్కని పాఠాలు కావాలంటే శరభోజీభాండారంలో ఉన్నవి.]